యువసాహితీలహరి - 3

# గోరంత దీపం ...

# కొండంత వెలుగు...

రెడ్డి రాఘవయ్య

**యువభారతి**

**సాహితీ సాంస్కృతిక సంస్థ**

ఆంధ్రసారస్వత పరిషత్ భవనములు, తిలక్ రోడ్,

హైదరాబాద్ - 500 001

**GORANTHA DEEPAM ....**
**KONDANTHA VELUGU.....**

**Reddi Raghavaiah**

Finite Light - Infinite illumination
(Incidents From The Lives of Great Personalities)


© యువభారతి :

ప్రచురణ : 165

ప్రథమముద్రణ : 2 సెప్టెంబరు 2001

ప్రతులు : 1000

ముద్రణ : చందనశ్రీ ప్రింటర్స్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 44

ప్రతులకు

**యువభారతి**

**సాహితీ సాంస్కృతిక సంస్థ**

ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు

తిలక్‌రోడ్ - హైదరాబాదు - 500 001

వెల : రూ 2/-

# ముందుమాట

ఎలాగోలా సమయాన్ని గడిపేయడం, అలా గడిపేయడాన్ని సమర్థించుకోవడం - మెచ్చదగ్గ విషయాలు కావు. సమయం విలువ తెలుసుకొని, సద్వినియోగ పరచుకుంటూ వున్నట్లయి తేనే, జీవితం సార్థక మౌతుంది.

సమయం సద్వినియోగ పరుచుకోవడానికి చదువుకున్నవారికి వున్న కొన్ని ముఖ్యమైన అవకాశాలలో, మంచి పుస్తకాలు చదవడం, ఒక ఉత్తమమైన మార్గం.

మంచి పుస్తకాలు, చాలా మంచి స్నేహితులు. నిజానికి ప్రతిరోజా కనీసం కొంత సమయాన్నయినా, మంచి పుస్తకాలను చదవడానికి తప్పనిసరిగా వినియోగించాలి. ఒక రోజా, పూట ఏకారణం చేతయినా ఆహారం మానుకోవలసివస్తే జరగబోయే నష్టం కన్నా, మంచి పుస్తకంలో నుంచి, ఒక పేజీఅయినా చదవకుండా ఒక దినం గడిచిపోతే, జరుగబోయేనష్టం, ఎన్నోరెట్లు ఎక్కువని మనం గుర్తుంచుకోవాలి.

మంచి పుస్తకాలలోని మంచి ఆలోచనలు మన మెదడుకు మంచి పోషకాహారం ...అన్నారు. చదవండి మననం చేసుకోండి. ఆ మాటల అర్థాన్నేకాక, ఆ ఆలోచనల సరమార్థాన్ని ఆకళింపు చేసుకోండి. స్వంతం చేసుకోండి. ఆ ప్రభావాన్ని మనసారా ఆహ్వానించి మంచి పునాదులు నిర్మించుకోండి. ఆ మంచి పునాదులపై, మంచి జీవితాలు నిర్మించుకోండి.

మహామహుల జీవితాలతో, పరిచయం పెంచుకోవడం, వారికి స్ఫూర్తినందించిన విషయాలతో మనం స్ఫూర్తి పొందడం మంచి జీవితాలకు

ఒక చక్కని రాచబాట. వారి జీవితాలలో కొన్ని ముఖ్యమైన సంఘటనలు. వారు ప్రతిస్పందించిన తీరు మనకు ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తాయి. మనకు ధైర్యాన్ని, నమ్మకాన్ని, ఆశను, ప్రేరణను కలిగిస్తాయి. "గోరంత దీపం కొండంత వెలుగు అన్నారు". వారి జీవితంలోని ఒక సంఘటన మేలుమలుపు అయితే, ఆ స్ఫూర్తితో మన జీవితంలో మేలు కొలుపును ఆహ్వానించవచ్చు.

ప్రతిరోజూ కనీసం ఒక పదినిమిషాలయినా, మిమ్మల్ని మరింత మంచి వారుగా తీర్చిదిద్దే మంచి వారి జీవితాలను అధ్యయనం చేయడం లోనూ ఆ మంచి ఆలోచనల పరిధిలో విహరించడం లోనూ గడపాలని దృఢనిశ్చయానికి రండి. ఆ నిర్ణయాన్ని, ఈ రోజు నుంచే అమలు పరచడానికి పూనుకోండి.

ఈ పుస్తకాన్ని రచించిన మా రాఘవయ్యగారు - పసి మనసుల పసిడి భావాలు తెలిసిన హృదయంగలవారు. కవి, రచయిత, బాలసాహిత్య స్రష్ట బహుగ్రంథకర్త. బాలసాహితీ విభూషణ బిరుదాంకితులు. మాయువ భారతికి కార్యదర్శి, కార్యదక్షుడు. అన్నింటినీ మించి నిగర్వి, సహృదయుడు.

ఈ చిన్న పుస్తకం చదివిన తరువాత - మీకేమనిపించింది? శ్రమ అనుకోకుండా - ఒక పోస్టు కార్డు వ్రాసి, మీ అభిప్రాయాన్ని తెలియపరుస్తే, భవిష్యత్తులో మరొకింత మేలైన ప్రయత్నానికి ప్రోత్సహించిన వారవుతారు.

శుభాకాంక్షలతో

సెప్టెంబరు 2, 2001.

**వంగపల్లి విశ్వనాథం**

సమావేశ కర్త

# మాన ధనం

రాజస్థాన్‌లోని 'చిత్తూరు దుర్గం' అతి ప్రసిద్ధి చెందింది. మొగలు సామ్రాజ్యాన్ని అక్బరు పరిపాలించే రోజుల్లో దాని మీద ఎన్నో సార్లు దాడి చేశాడు.

చిత్తూరు పరిపాలకుడు ఆ దాడులను చాలావరకు త్రిప్పికొట్టాడు. అతడు అతిసాహసి. స్వధర్మరక్షా పరాయణుడు.

అక్బరు అటువంటి గొప్పవానితో స్నేహంచేయాలను కున్నాడు. తన కొలువులో ఉన్న మానసింహుడనే రాజపుత్ర వీరుడిని చిత్తూరు పంపించాడు.

చిత్తూరు రాణా మానసింహుడిని సాదరంగా ఆహ్వానించాడు. కుశల ప్రశ్నలు అయిన తరువాత

"మీరు చాలాదూరం నుండి వచ్చారు. ఆకలితో ఉన్నట్లున్నారు. భోజనం చేద్దురు రండి!" అని ఆహ్వానించాడు రాణా.

రాణా కుమారుడు భోజనం ఏర్పాట్లు చేశాడు. అది అతి సామాన్యుడు తినే ఆహారం. మానసింహుడు ఆశ్చర్యపోయాడు. తినటానికి తటపటాయించాడు.

"మీరు నాతో భోజనం చేయరా!" అని రాణా, అతడి కుమారుణ్ణి అడిగాడు.

"మీరు మాకు అతిథులు. మాకంటే ముందే భోజనం చేయాలి" అన్నాడు రాణా.

"అయినా అతిథితోపాటు గృహస్థు కూడా భోజనం చేయటం ఆచారం". మానసింహుడు అన్నాడు.

"క్షమించండి. నేను మీతో కలసి భోజనం చేయలేను" రాణా మెల్లగా జవాబు ఇచ్చాడు.

"ఎందుకో తెలుసుకోవచ్చా?" మానసింహుడు అనుమానంతో అడిగాడు.

"మీరు మీ గౌరవాన్ని శత్రువుకు కుదవబెట్టారు. అందుకని" రాణా జవాబు.

ఆ జవాబు విన్న మానసింహుడు మండి పడ్డాడు. "నేను స్నేహితుడిలా మీ చెంతకు వచ్చాను. కాని మీరు నన్ను అవమానించారు. మీరు తగిన ఫలితాన్ని అనుభవిస్తారు." అన్నాడు.

"మానధనులు ఎప్పుడూ.. దేనికీ భయపడరు. మీరు ఏమి చేయగలరో తెలుసు. అదే జరిగితే యుద్ధభూమిలోనే కలుసు కుందాం!".

రాణా మాటలు విన్న మానసింహుడు రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడు.

మానధనం గొప్పను నిలబెట్టిన ఆరాణాయే ప్రతాపసింహుడు. ఎన్నికష్టాలు వచ్చినా అక్బరుకు తలవంచలేదు. ★

# కట్టుబాటు

అది 1699వ సంవత్సరం. వైశాఖమాసం మొదటిరోజు. పంజాబులోఉన్న "ఆనందపూర్" అనేకోటలో ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశానికి అశేష ప్రజానీకం చాలాచోట్ల నుంచి వచ్చారు.

సమావేశం ప్రారంభిస్తూ ఆ కోట అధిపతి "నాకొక తలకాయ కావాలి!" అని అడిగాడు... సభలోని వారంతా ఆశ్చర్యంలో మునిగారు... ఎవరూ ముందుకు రాలేదు.

కొంత సేపటికి ఓ యువకుడు ధైర్యంగా "నా తల ఇస్తాను" అంటూ ముందుకు వచ్చాడు.

అధిపతి అతడిని ప్రక్కనే ఉన్న గుడారంలోనికి తీసుకువెళ్ళాడు.... కొంతసేపటికి రక్తసిక్తమైన ఖడ్గంతో వచ్చాడు.

మళ్లీ "నాకింకోతల కావాలి!" అన్నాడు. ఇట్లా వరసగా ఇంకొక నలుగురిని గుడారం లోనికి తీసుకు వెళ్ళి రక్తసిక్తమైన ఖడ్గంతో వచ్చాడు... అక్కడ చేరినవాళ్ళల్లో భయాందోళనలు పొడ చూపినాయి.

కొంత సేపటికి గుడారంలోని అయిదుగురూ బయటికి వచ్చారు... వాళ్లు మరణించనందుకు అందరూ సంతోషించారు...

అధిపతి సభకు చెప్పాడు

"వీళ్ళు అయిదుగురూ ధర్మ రక్షణకు పంచప్రాణాలు.. వాళ్ళ విశ్వాసం నూతన జాతికి ఊపిరి పోసింది. అదే ఖల్సా.... లేక "పరిశుభ్రత" అన్నాడు.

అధిపతి వాళ్లకు మత దీక్షను ఇచ్చాడు.

"మీరంతా ఇకనుంచి... కేశం (జుట్టు)...కంగా (దువ్వెన)...కచ్చా (పాగా)...కడ్...(కడియం)...ఖడ్గ్ (ఖడ్గం) ధరించాలి. అధర్మానికి ఎదురీది పోరాడాలి." అని వారిని ఉత్తేజితుల్ని చేశాడు.

"మీరు ఇక నుంచి "సింగ్" లుగా పిలువబడతారు" అన్నాడు...అందరూ ఆనందించారు...

కొందరు లేచి "మరి మీరు నేటినుంచి "గోవిందరాయ్" కాదు...గోవిందసింగ్" అన్నారు.

అతడే సిక్కులను "సింహాలు" (సింగ్)గా మార్చిన పదవ గురువు "గురు గోవింద సింగ్". ★

> ఒక గొప్ప పుస్తకం చదివినప్పుడు ఓ కొత్త స్నేహితుడు దొరికినంత సంబరమూ, దాన్ని మళ్ళీ చదివితే చిరకాల మిత్రుడిని కలిసినంత ఆనందమూనూ. - గోల్డ్‌స్మిత్

# హిందూనీతి

రాయిఘడ్ అనే కోట కొండలమీద ఉన్నది. ఆ కోటలో ఆరోజు మహారాజు దర్బారు తీర్చాడు. కోటంతా చాలా కోలాహంగా ఉన్నది. దానికి కారణం ఆ మహారాజు సైనికులు "కళ్యాణి" దుర్గాన్ని గెలవటం.

కళ్యాణ్‌ను జయించిన సైనికులు ఒక్కొక్కరే కోటకు చేరుకుంటున్నారు. వారు కోటలో కొల్ల గొట్టిన ధన సంపదను మహారాజుకు సమర్పించు కుంటున్నారు.

అంతలో ఆ సేనాపతి వచ్చాడు. అతడి పేరు అబాజీమహాదేవుడు.. కళ్యాణ్‌ను ఓడించటంలో ప్రముఖపాత్రను వహించింది అతడే!

"మహారాజా! నేను మీకు అమూల్యమైన కానుకను తెచ్చాను.... చూడండి" అంటూ ఒక అందమైన అమ్మాయిని చూపాడు.

కళ్యాణ్‌లోని ముస్లిం సరదారు "ముల్లా అహమద్" అనేవాని కోడలు ఆమె... సైనికులచేత చిక్కింది.

" ఈమె ఎంత అందంగా ఉందో చూడండి... ఈమెపై ప్రేమ గలిగి స్వంతం చేసుకోవాలని మీకు అనిపించటంలేదా?" సైన్యాధిపతి మహారాజును అడిగాడు.

మహారాజు సింహాసనం నుంచి లేచాడు.... ఏమీమాట్లాడకుండా ఆ ముస్లిం యువతి దగ్గరకు వెళ్లాడు. ఆయన చేతిని ఎత్తి ఆమె తలమీద ఉంచాడు.

"అవును... ఈమెపైన నాకు ప్రేమ ఉన్నది.. నిజంగా ప్రేమిస్తున్నాను." అని అన్నాడు.

సైన్యాధిపతి సంతోషించాడు.

మహారాజు మళ్లీ ... "కాని ...నా సోదరిగా" అని అనగానే అందరూ ఆశ్చర్య పోయారు.

సైన్యాధిపతి సిగ్గుతో తలవంచుకున్నాడు.

"మహారాజ్!" అని ఆ యువతి సాగిలపడి వందనం చేసింది మహారాజుకు.

"నా తల్లి నీలా అందంగా ఉంటే నేను కూడా అందంగా ఉండేవాడిని". అని ఆప్యాయంగా అన్నాడు మహారాజు.

అన్ని సౌకర్యాలు కలిగించి ఆ యువతిని ఆమెభర్త ఇంటికి సగౌరవంగా చేర్చాడు మహారాజు.

ఇలా చేసి "పరస్త్రీని సోదరిగా చూడు!" అనే హిందూనీతిలోని గొప్ప తనాన్ని అందరికీ చాటాడు ఆయన...

ఆయనే "ఛత్రపతి శివాజీ మహారాజు". ★

# అగ్నిజ్వాల

అది గ్వాలియర్ కోట, దానిని ఆంగ్లేయులు ముట్టడించారు.

గుర్రం ఎక్కి భారతసైనికుల సాయంతో ఆంగ్లేయులను ఎందుర్కొన్నది ఒక వీర యువతి. ఆమె పురుష వేషం ధరించి ఉన్నది.

అపర చండికలా ఆంగ్ల సైన్యాన్ని చీల్చి చెండాడుతున్నది. కాని ఆంగ్లేయుల తుపాకులు, ఫిరంగులముందు ఆమె 'బలం' చాల లేదు.

ఆంగ్లేయులకు 'సర్‌హ్యూరోజ్' నాయకుడు.

పోరు ఘోరంగా జరిగింది. పురుష వేషంలో ఉన్న ఆ వీర యువతి, విప్లవసైన్యాలను కలుసుకొని వారిని కూడా కలుపుకొని రావాలనుకున్నది. యుద్ధరంగం నుంచి కదలి బయలు దేరింది.

ఆమెను ఆంగ్లేయులు వెన్నంటారు.

దారిలో ఒక కాలువ ఎదురయ్యింది. ఆమె గుఱ్ఱం ఆగిపోయింది.

ఇంతలో ఒక ఆంగ్ల సైనికుడు ఆమెను వెన్నుపోటు పొడిచాడు. ఆమె చేయి తెగిపోయింది. ఉన్న చేతితోనే ఆ సైనికుడిని ముక్కలు ముక్కలుగా నరికి వేసింది.

ఇంతలో ఇంకా ఇద్దరు ఆంగ్ల సిపాయిలు వచ్చి ఆమెను ఎదుర్కొన్నారు. మహిషాసురమర్దనిలా ఆమె వీరవిహారం చేసింది. ఒకడిని చీల్చిచెండాడింది. రెండవవాడు ఆమె వక్షస్థలాన కత్తి దెబ్బవేశాడు. వాడినీ ఆమె చంపివేసింది.

ఆమె శరీరం రక్తసిక్తమయ్యింది. దగ్గరలో ఆంగ్ల సైనికులెవరూ కనుపించలేదు.

గుర్రం మీదనుండి ఆమె భూమిమీదకు పడిపోయింది. దగ్గరలోనే 'బాబాగంగాదాస్' అనే ఆయన పర్ణకుటీరం ఉన్నది.

ఆయన పరుగెత్తుకుంటూ వచ్చి ఆమెను కుటీరంలోనికి తీసుకువెళ్లాడు.

"బాబాజీ! ఈ పవిత్రమైన శరీరాన్ని మ్లేచ్ఛుల చేతితో తాకనీయకండి. ఈ పవిత్రమైన 'అగ్ని' కి ఆహుతి చేయండి", అని ప్రాధేయపడి ప్రాణాలు విడిచింది.

బాబా ఆమె చెప్పినట్లే చేశాడు. తెల్లవారి చూపులు ఆమె శరీరం మీద వాలకుండానే ఆమె శరీరం అగ్ని జ్వాలల్లో కలిసింది. అక్కడకు వచ్చిన ఆంగ్లేయులు ఆ అగ్ని జ్వాలలు చూచి ఆశ్చర్యపోయారు.

భారతీయ శౌర్యం మూర్తీభవించిన ఆ వీరనారియే "ఝాన్సీ లక్ష్మీబాయి"... ★

# సమతాసందేశం

అది మహారాష్ట్రలోని ఒక మారుమూల గ్రామం...

ఉదయాన్నే ఆగ్రామానికి ఎవరో అగంతకులు వచ్చారు. ఆ ఊరి దేవాలయాన్ని వెతుక్కుంటూ వెళ్ళారు... తమ దగ్గర ఉన్న చీపురు కట్టలు తీశారు.. గుడి ఆవరణ అంతా శుభ్రం చేశారు.. ఎటువారు అటు వెళ్లిపోయారు..

మళ్లీ సాయంత్రం అక్కడకు చేరుకున్నారు... అందులో ఒకరు కీర్తనపాడసాగారు... ఒకరు తాళం వేస్తుంటే, ఇంకొకరు మృదంగం వాయించసాగారు.. ఆ సంగతి ఊరంతా పాకింది. ఊరిలోని వారు ఒక్కొక్కరే దేవాలయం ప్రాంగణానికి చేరుకున్నారు... కీర్తనామాధుర్యంలో లీనమయ్యారు.

పాట అందరినీ భక్తి పారవశ్యంలో ముంచి తేలుస్తున్నది. అందరూ ఆనందంగా ఉన్నారు. ఇంతలో కీర్తన ఆగింది. కీర్తన పాడిన వ్యక్తి తన ప్రక్కన నిలబడి ఉన్న వ్యక్తిని చూశాడు. ఆ నిలబడి ఉన్న వ్యక్తిపేరు "శంభూరావ్ సాంభస్" ఉన్నత కులస్థుడు.. పాట పాడిన వ్యక్తి ఆయన్ను అడిగాడు..

"సోదరా నీవు ఉన్నతకులస్థుడివి కాదా?"

"అవును" శంభూరావు సమాధానం ఇచ్చాడు..

"నీనోట్లో ఎన్ని పళ్లున్నాయి?"

"ముప్ఫైరెండు"

"ముప్ఫై నాలుగు ఎందుకు కాకూడదు అదిగో అక్కడున్నాడే అర్జున్ యాంగ్, ఆయననోట్లో ఎన్నిపళ్లున్నాయి?"

"అతడికి కూడా ముప్ఫైరెండే!"

"అరే! అట్లాగా! ఇరవై ఏడో... ఇరవై ఎనిమిదో కాదా?"

"వీల్లేదు. అలా ఉండటానికి వీలు లేదు. అది అసంభవం.."

అలా అడిగిన వ్యక్తి ప్రజలవైపు తిరిగాడు..

"మీరు చూశారుగా... ప్రకృతి ప్రతివారినీ ఒకేవిధంగా సృష్టించింది... ఉన్నత కులస్థుల దేవుడు, మహర్‌ల దేవుడూ ఒక్కడే! మరి ఈ బేధాలన్నీ ఎందుకు? ఈ అంటరాని తనం అనే అంటురోగం ఎలా వచ్చింది?"

ఈ విధంగా ప్రతిచోటా సమతా సందేశాన్ని వినిపించాడు. ఆవ్యక్తి పేరు "డేబు" చేతిలో ఎప్పుడూ చిన్నపాత్ర ఉండటం వల్ల అందరూ "గడగ్ బాబా!' అనేవారు. చదువు సంధ్యలు నేర్వలేదు. "సంచార సన్యాసి"గా పేరు పొందాడు. మహారాష్ట్రలో ఎన్నో ధర్మసంస్థలు స్థాపించాడు.. ★

# వింత నిరసన

అవి 1912వ సంవత్సరం చివరిరోజులు...కొద్ది రోజులక్రితం అయిదవ జార్జి చక్రవర్తి పట్టాభిషేక వార్షికోత్సవం దేశమంతటా జరిగింది.. ఆ రోజుల్లోనే వందేమాతరం ఉద్యమం సాగుతున్నది. దానితో జాతీయ భావాలు ప్రజల్లో పెంపొందసాగాయి.

అదే రోజుల్లో కాకినాడ పిఠాపురం రాజావారి హైస్కూల్లో ఒక అబ్బాయి మూడవఫారం చదువుతుండేవాడు.. ఆ అబ్బాయికి అదేక్లాసులో ఒకస్నేహితుడు కూడాఉన్నాడు.. పట్టాభిషేక ఉత్సవం ఆ స్కూల్లో కూడా జరిగింది.

ఆ స్నేహితుడికి ఒక అన్నయ్య ఉన్నాడు..అతడు ఇంటర్ చదువుతున్నాడు..హైస్కూల్లో చదువుతున్న తన తమ్ముడిని చూచిపోదామని వచ్చాడు. ఆ నాడు భారతీయుల్లో రాజభక్తిని పెంపొందించాలి. ఆంగ్లపాలకులు ప్రయత్నాలు చేయసాగారు.. అందుకు పంచమజార్జి చక్రవర్తి బొమ్మతో ఫలకాలను తయారు చేసి విద్యార్థులకు ఉచితంగా ఇస్తుండేవారు...తమ్ముడిని చూడటానికి వచ్చిన అబ్బాయి అటువంటి ఫలకాలను కొన్ని తీసుకువచ్చి ఇచ్చాడు.. వాటిల్లో కొన్ని అతడు తన స్నేహితునికి ఇచ్చాడు... ఆ

స్నేహితుడు వాటిల్లో ఒక్క దానిని మాత్రం ఉంచుకొని మిగతావాటిని దూరంగా పారవేశాడు..

అతడు ఉంచుకున్న ఫలకాన్ని గుండెమీద చొక్కాకు తగిలించు కున్నాడు.. ఆ చేష్ట అతడి సహచరుడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. కొంచెం కోపాన్ని కూడా తెప్పించింది..." ఎందుకు వాటిని అట్లా విసిరిపారేశావ్?" అని అడిగాడు...

"అవి బానిస చిహ్నాలు.. అవి అంటే నాకు అసహ్యం కలిగింది..." అని ఆ అబ్బాయి జవాబు ఇచ్చాడు.

"మరి ఈ ఒక్కటి మాత్రంచొక్కాకు ఎందుకు తగిలించు కున్నావ్!" మళ్లీ అడిగాడు స్నేహితుడు..

"ఎందుకా! వీడు ఎక్కడ ఉన్నాడు?... మన గుండెల మీద... అది తెలియటానికే ఇలా గుండె మీద చొక్కాకు తగిలించు కున్నాను"

ఈజవాబుతో ఆ అబ్బాయి స్నేహితుడు అవాక్కయ్యాడు...తన మిత్రుడిలోని దేశభక్తికి ఎంతో సంతోషించాడు...

అలా జవాబు ఇచ్చిన అబ్బాయే "అల్లూరి సీతారామరాజు" మన్యప్రజల క్షేమంకోసమై ఆంగ్లేయులతో పోరాటం సలిపాడు... ఆ పోరాటంలోనే చివరకు తన ప్రాణాలను అర్పించాడు... ★

# మంచిసలహా!

తిరుత్తణి గొప్ప పుణ్యక్షేత్రం....

ఆ చోట ఒక పాఠశాలలో పూర్వం జరిగిన సంఘటన ఇది....ఆ పాఠశాలలో ఒక విద్యార్థి ఉండే వాడు. అతడు విద్యలో మేటి. ఉపాధ్యాయులను గౌరవించేవాడు. తనతోటి బాలలకు సత్ప్రవర్తన గురించి బోధిస్తూ ఉండేవాడు.

అతడు చదివేతరగతి లోనే మరో పిల్లవాడు ఉన్నాడు..ఒకరోజు ఆ పిల్లవాడు ఉపాధ్యాయుడి కుర్చీకి తారుపూశాడు. గదిలోకి వచ్చిన ఉపాధ్యాయుడు అది చూచి ఉగ్రుడై పోయాడు..కోపంతో ఉగిపోతూ "ఎవరు ఈ పని చేసింది?" అని గద్దించి అడిగాడు.

పిల్లలంతా కుక్కిన పేనులై పోయారు..ఆ పని చేసింది ఎవరో తెలిసినా చెప్పలేకపోయారు..కాని మనం ముందు చెప్పుకున్న పిల్లవాడు మాత్రం ఊరుకోలేక పోయాడు. ఆ పని చేసిన పిల్లవాడి పేరు చెప్పాడు.. అలా చెప్పి కుర్చీకి ఉన్నతారును శుభ్రం చేశాడు...

ఉపాధ్యాయుడు కొంటెపని చేసిన పిల్లవాడి వైపు కదిలాడు... పేరు చెప్పిన కుర్రవాడు అడ్డు తగిలి "అయ్యా! అతడిని కొట్టకండి. ఇంకొకసారి ఇటువంటి పనులు చేయడు." అని

వేడుకున్నాడు.. దానితో ఉపాధ్యాయుడు ఆ పిల్లవాడిని కొట్టుకుండా వదలి వేశాడు.

కాని కొంటె పిల్లవాడు అంతటితో ఊరుకుండ లేదు. తాను చేసిన పని గురించి ఉపాధ్యాయుడితో చెప్పినందుకు ఆ పిల్లవాడి పైన కోపం పెంచుకున్నాడు. పాఠశాల వదలిన తరువాత అతడిని అటకాయించాడు.

"నా సంగతి టీచరుకు చెబుతావా? అంటూ కొట్టటానికి మీదకు వచ్చాడు... మంచి పిల్లవాడు మాత్రం అతడిమీద తిరిగి కలబడలేదు... కాని శాంతంగా...

"నన్ను కొట్టు ఫరవాలేదు. కాని నీవు చేసింది మాత్రం మంచి పనికాదు. ఈ రోజు కాకపోయినా ఇంకొకసారి ఎప్పుడన్నా ఇటువంటి పనులే చేస్తావు... అప్పుడయినా నీవు చేసిన పని ఉపాధ్యాయుడికి తెలిసిపోతుంది.. దానికి శిక్ష ఏమిటో తెలుసా? పాఠశాల బహిష్కరణ... దానితో నీ చదువు ఆగిపోతుంది... నీ తల్లిదండ్రులు బాధపడతారు. ఇక నుండీ ఇటువంటి పాడు పనులు మానివేయ్!" అని సలహా ఇచ్చాడు...

కొంటె పిల్లవాడికి ఆ మాటలు నచ్చాయి. ఆ పిల్లవాడిని కొట్ట కుండా వదలిపెట్టాడు. నాటినుండి తన ప్రవర్తనను మార్చుకున్నాడు.

అలా ఆ పిల్లవాడికి మంచి సలహా ఇచ్చిన అబ్బాయే "సర్వేపల్లి రాధాకృష్ణన్..."

★

# విధి నిర్వహణ

అది 1923వ సంవత్సరం

కాకినాడలో కాంగ్రెసు సభలు జరుగుతున్నాయి. ఆ సభలకు ఎక్కడెక్కడి నుంచో ప్రముఖులు వచ్చారు. సభాస్థలం దగ్గర కోలాహలంగా ఉన్నది.

సభాప్రవేశానికి రుసుము నిర్ణయించారు. టిక్కెట్టు కొని లోపలికి పోవాలి. ద్వారం దగ్గర వాలంటీర్లు చాలా మంది ఉన్నారు.

ఇంతలో కొండా వెంకటప్పయ్యగారు వచ్చారు. ఆ వాలంటీర్లలో ఒక పదిహేనుసంవత్సరాల అమ్మాయి ఉన్నది. ఆమెతో వెంకటప్పయ్యగారు "అమ్మాయీ! టిక్కెట్టు లేనిదే ఎవరినీ లోపలికి పంపకు. పైనుంచి దేవుడు దిగివచ్చినా సరే! టిక్కెట్టు ఉండాలి. తెలిసిందా?" అని హెచ్చరించారు.

ఆ అమ్మాయి "సరే"నన్నది. టిక్కెట్టు అడిగి ప్రతివారినీ లోపలికి పంపిస్తున్నది. ఇంతలో జవహర్‌లాల్ నెహ్రూగారు వచ్చారు. ఆయన వెంట చాలామంది ప్రముఖులు ఉన్నారు. ఆ అమ్మాయికి ఆయన ఎవరో తెలియదు.

తన మామూలు ధోరణిలో "టిక్కెట్టు ఇవ్వండి!" అని నెహ్రూజీని

నిలవేసింది. ఆయన దగ్గర టిక్కెట్టు లేదు. "టిక్కెట్టు లేకుంటే లోపలికి వెళ్లటానికి వీలు లేదు" అని ఆ అమ్మాయి నిక్కచ్చిగా చెప్పింది.

నెహ్రూ చుట్టూ ఉన్నవారికి ఆమె మాటలతో కోపం వచ్చింది. "ఆయన ఎవరనుకుంటున్నావ్!" అని ఆ అమ్మాయిని కోప్పడ్డారు.

"నా విధి నేను నిర్వహిస్తున్నాను. దానిలో తప్పేమున్నది". అని జవాబు ఇచ్చింది ఆ అమ్మాయి.

ఇంతలో నెహ్రూజీ ప్రక్కనున్న వారిలో ఒకరిని పంపి టిక్కెట్టు తెప్పించుకున్నారు. ప్రక్కనున్న వారితో "మీరు ఆమెను ఎందుకు కోప్పడాలి ఆమె విధి అదికదా..." అన్నారు. టిక్కెట్టు ఇచ్చి లోపలికి వెళ్లారు.

నెహ్రూ లాంటివారినే నిలవేసిన ఆ అమ్మాయే "దుర్గాబాయ్ దేశముఖ్" తరువాత ఎన్నో మహిళాసంస్థలను స్థాపించింది. గొప్ప దేశభక్తిపరురాలుగా పేరు సంపాదించింది. ★

> చాలా పుస్తకాలు వాటి రచయితల మాదిరిగానే కాలగర్భంలో కలిసిపోతాయి. కాని కొన్ని పుస్తకాలు మాత్రం మన మీద శాశ్వతంగా ప్రభావాన్ని కలిగి ఉంటాయి. - స్మార్ట్

**యువసాహితీలహరి**

# ఒక మాట

నిజం. నిజంగానే ఒక మాట చాలు. ఒకే ఒకమాటు చాలు. "మంచి మనిషికి ఒకమాట" అన్నారు గదా పెద్దలు. ఈ ప్రచురణ యువతకోసం. 'యువసాహితీలహరి' పరంపరలో వెలువడిన మూడవ పుస్తకం

నిజానికి అందరికోసం. అందరూ చదవాలనీ, చదివించాలనీ మా ఆలోచన. నిరంతరం, మంచి ఆలోచనలు వస్తూ ఉండాలనుకుంటే, మంచి పుస్తకాలు చదువుతూ ఉండాలి. ఆ మంచి ఆలోచనలు ముందుగా మంచి మాటలుగా వెలువడి మంచి పనులకు పునాదులవుతాయి.

యువతకు మంచి ఆలోచనలను అందించటం ద్వారా యువత మేలు కోసం, సమాజ శ్రేయస్సుకోసం, దేశ ప్రగతి కోసం, కావలసిన కృషిని ప్రేరేపించినట్లవుతుందన్న మా యువభారతి ఆశయానికి హార్దికంగా, ఆర్థికంగా చేయూతనిచ్చి మీ ముందు ఈ చిన్న పుస్తకాన్ని ఉంచడానికి ముందుకు వచ్చిన వారు, **శ్రీ కొమ్ము దక్షిణామూర్తిగారు.** యువకులు సౌజన్యమూర్తులు, రెండు తరాలుగా యువభారతి పుస్తకాలు చదువుతూ, వాటిచే ప్రభావితులై ఇలా ఆర్థిక సహాయాన్ని అందించిన వారికి మా కృతజ్ఞతాభివందనాలు.

యువభారతి ఆశయానికి, ఆ ఆశయంపై వారికున్న నమ్మకానికి నిదర్శనంగా, మీలో మంచి ప్రేరణ కలుగుతుందని ఆశిస్తూ -

**డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు**

అధ్యక్షులు, యువభారతి

# రచయిత పరిచయం

* బాలసాహిత్యరచనకే జీవితాన్ని అంకితం చేసిన బహుకొద్ది మందిలో శ్రీ రెడ్డి రాఘవయ్యగారు ఒకరు.
* తొలికథ "సలహా" (పిల్లలకథ) విశాలాంధ్ర దిన పత్రికలోని 'చిన్నారిలోకం' లో 1955 డిసెంబరులో ప్రచురించబడింది. నాటినుంచి బాలల గేయాలు, గేయకథలు. పాటకథలు, సైన్స్ కథలు, బాల సాహిత్యంపై వ్యాసాలు ఎన్నో వివిధ పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఇప్పటివరకూ వివిధ ప్రక్రియల్లో వ్రాసిన 33 పుస్తకాలు ప్రచురించ బడ్డాయి. ప్రస్తుతం ఈ చిరుపుస్తకంలో ఉన్న కథల్లాంటి కథలు ఒకనూరు 'మణిదీపాలు', 'మంచిపూలు' పుస్తకాలుగా వచ్చాయి. మణిదీపాలు "Leading Lights" గా ఆంగ్లంలోకి అనువదించబడింది.
* ఆకాశవాణి ద్వారా గేయాలు, పాట కథలు, రూపకాలు ఎన్నో ప్రసారమయ్యాయి.
* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన ఒకటవ తరగతి వాచకంలో ఒక గేయం, 5వ తరగతి వాచకంలో "డా॥ యల్లాప్రగడ జీవిత కథ" చోటు చేసుకున్నాయి. కర్ణాటక ప్రభుత్వం, వారి 4వ తరగతి వాచకంలో కొన్ని పదాలను చేర్చింది.
* జాతీయ బాలసాహిత్యం పోటీలో 'గాలిలో ప్రయాణం', 'సూక్ష్మజీవులు-వాటి నిరోధకులు' పుస్తకాలకు బహుమతులనందుకున్నారు.
* కరీంనగర్‌లో "మలయశ్రీ సాహితీ అవార్డు" తోనూ, హైదరాబాదులో "ఊయల కమ్యూనికేషన్స్" వారి "బాలసాహితీ విభూషణ" బిరుదుతోనూ సత్కరింపబడ్డారు...

చుట్టూరా ఆవరించుకుని వున్న
చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం
కంటె, ప్రయత్నించి ఎంత చిన్న
దీపాన్నయినా వెలిగించడం మంచిది.

---


# యువభారతి ప్రచురణలు

50% తగ్గింపు ధరలో లభిస్తాయి

వివరాలకు : **యువభారతి**

ఆంధ్రసారస్వత పరిషత్ భవనములు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

# యువభారతి

## నగర గ్రంథాలయ సంస్థ

**ఊయల**

సంయుక్త ఆధ్వర్యంలో

**"వ్యక్తిత్వ వికాసం"** పై

యువతీయువకులకు సమావేశాలను

ప్రతినెలా మొదటి ఆదివారం

**మధ్యాహ్నం 2-00 గం॥ల నుండి**

**సాయంత్రం 7-30 గం॥ల వరకు**

నగర కేంద్ర గ్రంథాలయంలో

(అశోక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్)

నిర్వహిస్తున్నది.

***"అందరూ ఆహ్వానితులే"***